క్లుప్తంగా

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే సదరం సర్టిఫికెట్లు ఇస్తున్నారని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి ఆరోపించారు. సోమవారం రిమ్స్‌లోని డైరెక్టర్ చాంబర్ ఎదుట దివ్యాంగులతో కలిసి నిరసన తెలిపారు. అర్హులైన వారికి సదరం సర్టిఫికెట్ ఇచ్చేందుకు వైద్యులు ఇబ్బంది పెడతున్నారని, వైద్యుల అలసత్వం కారణంగా ప్రభుత్వ ఫలాలు అందకుండా పోతున్నాయన్నారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, ప్రమోద్‌రెడ్డి, గజానంద్, ఫహీమ్, శ్రీను పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై సాయన్న

నేరడిగొండ: హైదరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో నిర్వహించే ఫొటోగ్రాఫర్ల పండుగ ఎక్స్‌పో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎస్సై సాయన్న ఆవిష్కరించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల సురేశ్, కోశాధికారి వినోద్, అన్వేష్, రాకేశ్, మద్దెల సాయి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

నేరడిగొండ: మండలంలోని తేజాపూర్ నిర్వహించే చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలి రావాలని రజక సంఘం నాయకులు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

నేడు బీజేపీ సమావేశం

నేరడిగొండ: మండల బీజేపీ నాయకుల సమావేశం మంగళవారం ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు సోసయ్య హీరాసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా, మండల నాయకులు, పోలింగ్ బూత్ అధ్యక్షులు, సభ్యులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, తదితరులు హాజరు కావాలని కోరారు.

ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో పయనించాలి



ప్రవచనాలు చేస్తున్న స్వామి

నేరడిగొండ: ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో పయనించాలని శివానందా భారతి స్వామి అన్నారు. సోమవారం మండలంలోని కుమారిలో శ్రీగురుదేవ్ సేవా ఆశ్రమంలో భగవద్గీత ప్రవచన కార్యక్రమం ప్రారంభించారు. భక్తి ప్రవచనాలు, భజనలు, మహాభారతం, గీత ప్రవచనాలు ఈనెల 30 వరకు నిర్వహించనున్నట్లు ఆశ్రమం భక్తులు తెలిపారు.

'పేదల ఇళ్లు తొలగించడం సిగ్గుచేటు'

ఆదిలాబాద్‌టౌన్: ఉత్తర్‌ప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం పేదల ఇళ్లను తొలగించడం సిగ్గుచేటని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. యూపీలో 80 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లను పోలీసుల ద్వారా తొలగించారని, ఇదేనా బీజేపీ నాయకులు చెప్పే రామ రాజ్యమని ప్రశ్నించారు. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడలో పేదలకు ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. నాయకులు ఇజ్జగిరి నారాయణ, రోకండ్ల రమేశ్, సాజిదొద్దీన్, రాజు, అశోక్, ఆశన్న పాల్గొన్నారు.

సామాజిక సేవ చేయడం అభినందనీయం

గుడిహత్నూర్: సామాజిక సేవ చేయడం అభినందనీయమని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పేయి అన్నారు. మండలంలోని మన్నూర్‌లో జైదేవీ మెడికల్ యాజమానుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆదివాసీలు ఎలాంటి అనారోగ్యానికి గురైన వెంటనే స్థానిక వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావ్, వైద్యాధికారి శ్యాంసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో సిబ్బంది కొరత

- జేఎల్‌ఎంలతో ఆపరేటర్ విధులు
- తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



నిపాని విద్యుత్ సబ్‌స్టేషన్

తాంసి: విద్యుత్ సరఫరా, సబ్‌స్టేషన్ల నిర్వహణలో విద్యుత్‌శాఖ సిబ్బంది పాత్ర చాలా కీలకం. కానీ భీంపూర్ మండల విద్యుత్‌శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. విద్యుత్‌శాఖలో సరిపడా సిబ్బంది లేని కారణంగా గ్రామాలకు తరుచూగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. సిబ్బంది లేమి కారణంగా మరమ్మతులు చేసేందుకు తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఎక్కడైనా సమస్య తలెత్తితే గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ఎప్పుడు కరెంట్ వస్తుందో తెలియని పరిస్థితి. భీంపూర్ మండలంలోని ఏ గ్రామాల్లో ఎప్పుడు కరెంట్ పోతుందోనని తెలియదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జేఎల్‌ఎంలపై పని భారం..

భీంపూర్ మండలంలోని విద్యుత్ సరఫరా కోసం రెండు సబ్‌స్టేషన్‌లు ఉన్నాయి. నిపాని,అర్లి(టి) సబ్‌స్టేషన్లలో ఆపరేటర్లు లేరు. ఒక్క సబ్‌స్టేషన్‌కు ఇద్దరు చొప్పున మొత్తం నలుగురు ఉండాలి. కానీ ఎక్కడా కూడా ఆపరేటర్లు లేని పరిస్థితి. ప్రస్తుతం ఉన్న ఆరుగురు జేఎల్‌ఎంలు సబ్‌స్టేషన్‌లలో వంతుల వారీగా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో పని భారం పడుతోంది. ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తూ.. విద్యుత్ లైన్ పనులు, సరఫరా సక్రమంగా జరిగేలా చూస్తున్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే జూనియర్ లైన్‌మెన్ వెళ్లి సమస్యను పరిష్కరించి, విద్యుత్‌ను పునరుదర్ధరించాల్సి వస్తోంది. మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఆయా గ్రామాల్లో 300 ట్రాన్స్‌ఫార్మర్‌లు, 6860 గృహ వాణిజ్య కనెక్షన్‌లు, 1500 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. వీటన్నింటికి కేవలం ఆరుగురు జేఎల్‌ఎంలు, ఇద్దరు లైన్‌మెన్‌లు, ఒక లైన్ ఇన్‌స్పెక్టర్, విద్యుత్‌శాఖ ఏఈ మాత్రమే ఉన్నారు. వీరితో పాటు ముగ్గురు అన్‌మ్యాన్‌డ్ వర్కర్లు పని చేస్తున్నారు. మొత్తం 13 మంది సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారు.

అంధకారంలో గ్రామాలు..

విద్యుత్ సరఫరా నిలిచిపోతే మరమ్మతులు చేపట్టడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. సెప్టెంబర్‌లో రెండుసార్లు వర్షం కారణంగా విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో ఆయా గ్రామాల్లో రాత్రి 9 గంటల వరకు విద్యుత్ లేక ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈనెల 3న మండలంలోని భీంపూర్ మండల కేంద్రానికి సమీపంలో తీగలపై చెట్టు విరిగిపడటంతో మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తిరిగి విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు రాత్రి 10 గంటల సమయం పట్టింది. సెప్టెంబర్ 24న ఆదివారం 33కే వీ విద్యుత్ తీగలపై గోన సమీపంలో చెట్టు కొమ్మ విరిగి పడటంతో అర్లి(టి) సబ్‌స్టేషన్‌తో పాటు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు అంధకారంలో ఉండాల్సి వచ్చింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

> **అంతరాయం లేకుండా చూస్తున్నాం**
>
> మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సరఫరా చేస్తున్నాం. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించి పునరుద్ధరిస్తాం. సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్లు లేక ప్రస్తుతం ఉన్న జేఎల్‌ఎంల ద్వారా పనులు చేపడుతున్నాం. విద్యుత్ సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తాం.
>
> – శ్రావణ్ కుమార్, ఏఈ భీంపూర్

అన్నివర్గాల వారికి ప్రాధాన్యత



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: అన్నివర్గాల వారికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఇమాం ఖాసిం బంగ్లా అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. రూ.2 కోట్లతో చేపట్టనున్న 14 షాపింగ్ దుకాణాలు, బంగ్లా, దర్గా నిర్మాణ పనులను ప్రారంభించి, పలు అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అందరి సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. పురాతనమైన ఇమాం ఖాసిమ్ బంగ్లాను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో రూ.2 కోట్ల నిధులను వెచ్చిస్తున్నట్లు తెలిపారు. డీఆర్‌వో రమేశ్ రాథోడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, యూనుస్ అక్బాని, సాజిదొద్దీన్, అష్రఫ్, శివకుమార్, బాదన్ గంగన్న, అశోక్, రాకేశ్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ఐటీడీఏ ఎదుట సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

ఇంద్రవెల్లి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అంగన్‌వాడీ సంఘం మండల అధ్యక్షురాలు సుభద్ర డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ఆత్రం నాగుబాయి, పెంటుబాయి, కమలబాయి, అనిత, సులోచన, సందా, అనుసూయ పాల్గొన్నారు.

తాంసి: గత కొన్నిరోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అంగన్‌వాడీలు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీలను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు సరితా రెడ్డి, భాగీర్థ, రూప, విజయలక్ష్మి, మమత, నర్సమ్మ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులు ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె సోమవారం 15 రోజులకు చేరింది. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీసం వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. పెన్షన్ ఈఎస్‌ఐ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించాలని కోరారు. సమ్మెలో అంగన్‌వాడీల సంఘం జిల్లా కోశాధికారి రత్నామాల, ముక్త, పద్మ, సంగీత, కవిత, లక్ష్మి, స్వర్ణలత పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె చేస్తున్న ఆశవర్కర్లు

నార్నూర్: ఆశ కార్యకర్తల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఆశ కార్యకర్తలకు పని తగిన వేతనం లేదన్నారు. గౌరవ వేతనం లేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ. 18వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జ్యోతి, కల్పన, అడే జ్యోతి, శ్రీలత, వందన, బొజ్జుబాయి, లక్ష్మిబాయి, రంబాబాయి, సుగుణ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఇంద్రవెల్లి: వైద్య ఆరోగ్య శాఖలో గ్రామీణ ప్రాంతంలో పని చేస్తున్న ఆశవర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు కాంత డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిరవధిక సమ్మె చేపట్టారు. ఆశ వర్కర్లకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. హెల్త్ కార్డులు, ప్రమాద బీమా కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు కనక తులసిబాయి, సంగీత, రాధాబాయి, సుమిత్ర, సోను, సులోచన, విమల, చంపబాయి, రుక్మాబాయి, మారుబాయి పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ప్రధానోపాధ్యాయులు

తలమడుగు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా వెంకట్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతిలో భాగంగా బరంపూర్ పాఠశాలలో విధులు నిర్వర్తించే వెంకట్రావు తలమడుగు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులుగా పదోన్నతి పొందారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం వినోద్‌రెడ్డి, ఉపాధ్యాయులు, వినోద్ రెడ్డి, మమత పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలో నాలుగు జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారు. ఇచ్చోడ జెడ్పీపాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా సురేష్ జోషి, ఉర్దూ మీడియం పాఠశాలలో రాథోడ్ బిక్కు, కోకస్‌మన్నూర్ పాఠశాలలో విజయలక్ష్మి, నర్సాపూర్ పాఠశాలలో శ్రావణ్‌లు బాధ్యతలు చేపట్టారు.

నేరడిగొండ: మండలంలోని కుమారి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా అరుగుల సత్యనారాయణ గౌడ్ పదోన్నతిపై వచ్చారు. సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనను పాఠశాల సిబ్బంది, కుమారి సర్పంచ్ ఓర్స రాజు యాదవ్‌లు ఘనంగా సన్మానించారు. తేజాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా మణిలత, నేరడిగొండలో పద్మ, వాంకిడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా చక్రపాణిలు బాధ్యతలు చేపట్టారు.

ప్రెషర్ కుక్కర్లు పంపిణీ

కైలాస్‌నగర్: కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాస రెడ్డి కేఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రెషర్ కుక్కర్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్, కేఆర్‌కే కాలనీ, బంగారుగూడ కాలనీల్లో తన సతీమణి సాయి మౌనారెడ్డితో కలిసి మహిళలకు కుక్కర్లు పంపిణీ చేశారు. నాయకులు, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

సొంత వాహనాలను తొలగించాలి



మాట్లాడుతున్న అయ్యుబ్ ఖాన్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారులు నడిపిస్తున్న సొంత వాహనాలను తొలగించాలని తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్, హైర్ వెహికిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అయ్యుబ్ ఖాన్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలో మాట్లాడారు. గత కొన్ని నెలలుగా వాహనాల బిల్లులు రెగ్యులర్‌గా రాకపోవడంతో ఇబ్బందికి గురవుతున్నామన్నారు. సొంత వాహనాలు పెట్టుకొని బిల్లులు తీసుకుంటున్న అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఇచ్చే బిల్లును రూ.43 వేలకు పెంచాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఫహీమ్, ఫారుఖ్, సికిందర్, రహెమాన్, నారాయణ పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధి కోసమే బీఆర్‌ఎస్, బీజేపీ కుట్రలు'



మాట్లాడుతున్న వెడ్మ భోజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: రాజకీయ లబ్ది కోసమే బీఆర్‌ఎస్, బీజేపీ కుట్రలు పన్నుతున్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ భోజ్జు పటేల్ అన్నారు. సోమవారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ప్రజాధారణ చూసి ఓర్వడం లేదన్నారు. ఢిల్లీ సభలో తమ జాతి కోసం మాట్లాడానే తప్పా.. పార్టీ కోసం కాదన్నారు. లంబాడాల పట్ల తనకు సోదరభావం ఉందన్నారు. మత ప్రాంతీయ రాజకీయాలు మానుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు పనిచేస్తున్న వారు ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయం చేయాలని హితవు పలికారు. ఆయన వెంట నాయకులు సంతోష్, భీమన్న, ఉత్తం, సాయి ప్రసాద్, సాహెబ్‌రావు పాల్గొన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చూడాలి



డ్రైడే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్: ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని నార్నూర్ సీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. సోమవారం తాడిహత్నూర్ ఎస్సీ గూడలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమలతో మలేరియా, డెంగ్యు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్, ఏఎన్‌ఎం సుశీల, ఊర్మిల పాల్గొన్నారు.

గాదిగూడలో..

గాదిగూడ మండలంలోని మారేగాం గ్రామంలో సోమవారం హెల్త్ సూపర్‌వైజర్ పవార్ రవీందర్ డ్రై డే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కుండలు, ట్యాంకులు, పాత టైర్‌లలో నిల్వ నీటిని ఖాళీ చేయించారు. సీజనల్ వ్యాధులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు.

'కాంగ్రెస్‌ను ఆదరించి.. గెలిపించాలి'



గ్యారెంటీ కార్డులపై ప్రచారం చేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించి గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ కోరారు. ఏఐసీసీ ప్రకటించిన కాంగ్రెస్ అభయ హస్తం ఆరు గ్యారెంటీ కార్డులను ఇంటింటికీ తీసుకెళ్లే కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలోని అబ్దుల్లాచౌక్‌లో ప్రారంభించారు. నాయకులు ఇంటింటికీ తిరుగుతూ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులు, మహిళలు, యువత అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చేలా గ్యారెంటీ పథకాలను రూపొందించడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి క్యాబినెట్‌లో నేవాటిని ఆమోదించి అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, నాయకులు అల్లూరి సంజీవ్ రెడ్డి, శ్రీధర్, సంతోష్, శివాజీ, వసీం ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి, హిందీ హైస్కూల్‌లో మహిళల సాధికారతపై విద్యార్థులకు జిల్లా మహిళా సాధికారత బృందం సోమవారం అవగాహన కల్పించారు. సంస్థ జిల్లా కోఆర్డినేటర్ యశోద మాట్లాడుతూ.. బేటీ బచావో.. బేటీ పడావో, బాల్య వివాహాలు, ఫోక్సో చట్టం, సెల్‌ఫోన్ వాడకంతో కలిగే నష్టాలు, విద్యార్థులు ఎదిగేందుకు వ్యక్తిత్వ వికాసం గురించి వివరించారు. కార్యక్రమంలో కృష్ణవేణి, కోటేశ్వర్, వెంకటేశ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలాల్లో భారీ వర్షం



అంతర్గాం వద్ద వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

తాంసి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. సోమవారం ఉదయం నుంచి కురిసిన వర్షానికి పలు గ్రామాల్లోని పంటచేలల్లో వర్షపునీరు చేరింది. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. భీంపూర్ మండలంలోని అంతర్గాం వద్ద ఉన్న లోలెవల్ వంతెనపై నుంచి వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

బజార్‌హత్నూర్: మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని మోర్ఖండి, చింతలసాంగ్వి, చందునాయక్ తండా, కొల్హారి, సుంగుగూడ, టెంబి గ్రామాల లోలెవెల్ వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహించింది. కొత్తపల్లి, గిరిజాయి, ఉమార్డ, ఇంద్రనగర్ సమీపంలో వాగులపై వంతెనలు లేకపోవడంతో ప్రజలు బాహ్య ప్రపంచానికి దూరమయ్యారు.

సంక్షిప్త వార్తలు

ఆర్థిక సాయం

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె)లో సోమవారం లింగం గురుజీ కుటుంబానికి పూర్వ విద్యార్థులు రూ. 50 వేల నగదు వారి కుటుంబ సభ్యులకు అందచేశారు. శిశుమందిర్ పాఠశాలో చదువు చెప్పిన లింగం గురుజీ నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. 1999– 2000సంవత్సరంలో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం చేశారు. అర్గుల గణేష్, దొడ సంతోష్, దిశెట్టి రాకేశ్, ముండే సాయినాథ్ పాల్గొన్నారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని చిన్నబుగ్గారం గ్రామానికి చెందిన జాదవ్ శివ్‌లాల్, జాదవ్ అమర్‌సింగ్, సక్రియనాయక్ తండా గ్రామానికి చెందిన రాథోడ్ సూర్య, వాంకిడి గ్రామానికి చెందిన అడిగం సురేశ్‌లు ఇటీవలే మరణించగా వారి కుటుంబసభ్యులను బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సోమవారం పరామర్శించారు.

చదువుతోనే గుర్తింపు

ఇంద్రవెల్లి: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎస్సై సునీల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బీఎస్‌ఎఫ్, సీఆర్‌పీఎఫ్ ఉద్యోగం సాధించిన అంజలి, సరస్వతిలను ఘనంగా సన్మానించారు. యువత చదువుపై దృష్టి సారించి, ఉన్నత శిబిరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న టీచర్స్ కాలనీకి చెందిన గురువులను జైవీర్ హనుమాన్ గణేష్ మండలి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. బెదొడ్కర్ సంతోష్, రవీంద్ర, అర్ష దేవిదాస్‌లను శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తులసీదాస్, సత్యనారాయణ, రాజేందర్, అశోక్, భోజారెడ్డి, తిలక్, శంకర్, శ్రీనివాస్, విక్రమ్, రవి, విష్ణు యాదవ్, కిరణ్, రాజు పాల్గొన్నారు.

72వ రోజుకు చేరిన డివిజన్ దీక్షలు

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని ఉద్యమం కొనసాగుతోంది. దీక్షలు సోమవారం 72వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో నారాయణ పూర్ గ్రామానికి చెందిన హర్షవర్ధన్ యూత్ సభ్యులు కూర్చున్నారు. ఎన్నికలలోపు డివిజన్ చేయాలని నినాదాలు చేశారు.

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

బోథ్: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేంత వరకు ఉద్యమాన్ని ఆపబోమని ఆదివాసీ నాయకులు అన్నారు. గతంలో కేసులు నమోదు కావడంతో సోమవారం బోథ్ జూనియర్ సివిల్ కోర్టుకు హాజరయ్యారు. అక్రమ కేసులు నమోదు చేస్తూ.. ఆదివాసీల అస్థిత్వాన్ని దెబ్బతీసేలా ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కొడప నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

గణపతి మండపాల్లో దీపారాధన

బోథ్: మండల కేంద్రంలోని మైసమ్మ కాలనీ వద్ద కొలువుదీరిన గణనాథుని వద్ద మహిళలు సోమవారం దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ సురేందర్, మహిళలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ సోమవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని గణేశ్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గణేశ మండపాల వద్దకు చేరుకొని గణనాథుడిని దర్శించుకున్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన బీజేపీ కార్యకర్తలు సుమన్, ఆనంద్ కనక, పోచంపల్లి సాయిలు బీఆర్‌ఎస్‌లో చేరగా.. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో ఆదరించి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.